అసంపూర్తి భవనాలకు మోక్షం

- వైసీపీ పాలనలో నిలిచిపోయిన మంప, శరభన్నపాలెం ఆశ్రమ పాఠశాలల అదనపు తరగతి గదుల నిర్మాణాలు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వం రాగానే పనులు పునఃప్రారంభం

- వార్త 8వ పేజీలో..

ఇంకా కోలుకోని గ్రామాలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలం

బంధవీధి, కొమ్ములవాడ గ్రామాలపై విరుచుకుపడిన కొండచరియలు, భారీ చెట్లు



భారీ వర్షాలకు కొండచరియలు, చెట్లు కొట్టుకు రావడంతో రూపురేఖలు మారిపోయిన బంధవీధిలోని పంట పొలాలు

- రూపురేఖలు మారిపోయిన పంట పొలాలు
- పది రోజులుగా విద్యుత్‌, మంచినీటి సరఫరా లేక గిరిజనుల ఇబ్బందులు
- కన్నెత్తి చూడని అధికారులు
- కలెక్టర్‌, ఐటీడీఏ పీవో స్పందించాలని ఆదివాసీల వేడుకోలు

సీలేరు, సెప్టెంబరు 18: బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఈ నెల 8న కురిసిన భారీ వర్షాలకు జీకేవీధి మండలంలోని పలు గ్రామాలు అతలాకుతలమయ్యాయి. ముఖ్యంగా బంధవీధి, కొమ్ముల వాడ గ్రామాల్లోని పంట పొలాలపైకి కొండచరియలు, భారీ చెట్లు, బురద విరుచుకుపడ్డాయి. దీంతో పొలాల రూపురేఖలే మారిపోయాయి. అయితే ఇప్పటి వరకు పంట నష్టాన్ని అంచనా వేయడానికి అధికారులు తమ గ్రామాలకు రాలేదని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షాలు చేసిన విధ్వంసం నుంచి బంధవీధి, కొమ్ములవాడ గ్రామాలు ఇంకా కోలుకోలేదు. పది రోజులుగా విద్యుత్‌ సరఫరా లేదు. మంచినీటి పథకాలు మరమ్మతులకు గురికావడంతో గిరిజనులు తాగునీటికి కటకటలాడుతున్నారు. గత్యంతరం లేక వాగుల నుంచి నీరు తెచ్చుకుని తాగుతున్నారు. పంట పొలాలను కొండచరియలు, చెట్లు, బురద ముంచెత్తడంతో వాటి రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. పొలాలను గుర్తు పట్టలేని పరిస్థితిలో ఉన్నాయి. ఇప్పటి వరకు తమ గ్రామాలను అధికారులు సందర్శించలేదని బంధవీధి, కొమ్ములవాడ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము దుర్భర జీవనం సాగిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని వాపోతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్‌, ఐటీడీఏ పీవో స్పందించి అధికారులను పంపించి పంట నష్టాన్ని అంచనా వేయించాలని, విద్యుత్‌ సరఫరా, మంచినీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో వాగునీరు తీసుకువెళుతున్న బంధవీధి గిరిజనులు

మలేరియా నియంత్రణకు పటిష్ఠ చర్యలు

- గత ఏడాదితో పోలిస్తే ఈసారి మలేరియా, డెంగ్యూ కేసులు తగ్గుముఖం
- జిల్లాలోని పది హాట్‌స్పాట్‌ పీహెచ్‌సీల పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలు
- డీఎంహెచ్‌వో డాక్టర్‌ సి.జమాల్‌ బాషా



డీఎంహెచ్‌వో డాక్టర్‌ సి.జమాల్‌ బాషా

పాడేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలేరియా నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్‌ సి.జమాల్‌ బాషా తెలిపారు. జిల్లాలో మలేరియా, డెంగ్యూ నివారణకు చేపడుతున్న కార్యక్రమాలపై బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మలేరియా, డెంగ్యూ కేసుల వ్యాప్తి తగ్గుముఖం పట్టిందన్నారు. గత ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు 2,984 మలేరియా, 114 డెంగ్యూ కేసులు నమోదయ్యాయన్నారు. ఈ ఏడాది ఇదే సమయానికి 2,534 మలేరియా, 28 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 64 పీహెచ్‌సీల్లో మలేరియా హాట్‌స్పాట్‌లుగా ఉన్న పది పీహెచ్‌సీలను గుర్తించి, ఆయా పీహెచ్‌సీల పరిధిలో మలేరియా నియంత్రణ చర్యలు ముమ్మరం చేశామన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రత్యేక వైద్య శిబిరాలు, పారామెడికల్‌ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారన్నారు.

తొలి విడతగా 1,767 గ్రామాల్లో దోమల మందు పిచికారీ

జిల్లాలో ఎంపిక చేసిన 1,767 గ్రామాల్లో దోమల నివారణ మందు స్ప్రేయింగ్‌ పనులు చేపట్టామని, రెండో విడతల స్ప్రేయింగ్‌ పనులు త్వరలో పూర్తవుతాయని డీఎంహెచ్‌వో తెలిపారు. అలాగే 17 వేల దోమతెరలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఎక్కడైనా మలేరియా, డెంగ్యూ కేసులు నమోదైతే తక్షణమే బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెబాట

జీవో నంబరు 85కు వ్యతిరేకంగా ఆందోళనలు

ఆస్పత్రుల్లో రోగులకు స్టాఫ్‌ నర్సులతో వైద్యం

ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు విధులకు హాజరయ్యేది లేదంటున్న వైద్యులు



జీకేవీధిలో వైద్యులు లేకపోవడంతో రోగులను పరీక్షలు చేస్తున్న స్టాఫ్‌ నర్సు

చింతపల్లి, సెప్టెంబరు 18: జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు సమ్మె బాట పట్టారు. జీవో నంబరు 85ను వ్యతిరేకిస్తూ మంగళవారం నుంచి విధులను బహిష్కరించి విజయవాడలో ఆందోళనలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు స్టాఫ్‌ నర్సులు వైద్య సేవలందిస్తున్నారు. దీంతో ఆదివాసీ రోగులకు వైద్యుల అత్యవసర సేవలు అందక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు విధులకు హాజరయ్యేది లేదని ధర్నా చేపడుతున్న వైద్యులు చెబుతున్నారు.

జిల్లాలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పరిధిలో 66 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు చొప్పున వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వీరంతా విధులను బహిష్కరించారు. దీంతో మెరుగైన వైద్య సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారు. మంగళ, బుధవారాలు పీహెచ్‌సీలకు వచ్చిన రోగులకు స్టాఫ్‌ నర్సులు వైద్య సేవలందించారు. గర్భిణులకు స్టాఫ్‌ నర్సులు ప్రసవాలు చేస్తున్నారు.

అనంతగిరి మండలంలో...

అనంతగిరి: మండలంలోని నాలుగు పీహెచ్‌సీల పరిధిలో వైద్యులు అందుబాటులో లేక గిరిజనులకు అత్యవసర వైద్యసేవలు అందడం లేదు. మండలంలోని అనంతగిరి, లంగుపర్తి, గుమ్మకోట, పినకోట పీహెచ్‌సీల్లో ఎనిమిది మంది వైద్యులు ఉన్నారు. మండలంలోని 418 గ్రామాల గిరిజనులు ఈ నాలుగు పీహెచ్‌సీల్లోనే వైద్య సేవలు పొందుతున్నారు. ప్రస్తుతం వైరల్‌ జ్వరాలు విజృంభిస్తుండడంతో అధిక సంఖ్యలో రోగులు పీహెచ్‌సీకి వస్తున్నారు. అయితే వైద్యులు లేకపోవడంతో వారికి మెరుగైన వైద్యం అందడం లేదు.



ఆర్‌వీనగర్‌ పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న డాక్టర్‌ కుర్చీ

ప్రత్యేక అలవెన్సులు ఇవ్వాలి

-డాక్టర్‌ లక్ష్మీకాంత్‌, వైద్యుల సంఘం జిల్లా నాయకులు, లోతుగెడ్డ



గిరిజన ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులకు ప్రత్యేక అలవెన్సులు ఇవ్వాలి. గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో ఎంబీబీఎస్‌ వైద్యులకు 30 శాతం, పీజీ వైద్యులకు 50 శాతం అలవెన్సులు ఇస్తున్నారు. గ్రామ స్థాయిలో రోగులకు వైద్య సేవలందిస్తున్న పీహెచ్‌సీ వైద్యులకు అలవెన్సులు ఇవ్వడం లేదు. అలెవెన్సులు ఇవ్వడంతో పాటు సమయానికి పదోన్నతులు కల్పించాలి. ప్రధానంగా జీవో నంబరు 85ను రద్దు చేసి, పాత విధానం అమలు చేయాలి.

రాయితీపై మిరియాలు వలిచే యంత్రాలు

- రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- కలెక్టర్‌ ఏఎస్‌ దినేశ్‌కుమార్‌

పాడేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ స్పైసెస్‌ బోర్డు సహకారంతో గిరిజన రైతులకు రాయితీపై మిరియాలు వలిచే యంత్రాలు, శుభ్రపరిచే యంత్రాలు పంపిణీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కలెక్టర్‌ ఏఎస్‌ దినేశ్‌కుమార్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిరియాలు వలవడానికి, ఎండబెట్టిన తరువాత శుభ్రం చేయడానికి ఉపయోగపడే యంత్రాలను గిరిజన రైతులకు 75 శాతం రాయితీపై అందిస్తామన్నారు. యంత్రాలు విద్యుత్‌, డీజిల్‌, పెట్రోల్‌ సహాయంతో పని చేస్తాయన్నారు. అలాగే అల్లం, పసుపు పాలిష్‌ చేసే యంత్రాలను 75 శాతం రాయితీపై మంజూరు చేస్తామన్నారు. రైతులు ముందుగా యంత్రాలకు పూర్తిగా చెల్లింపు చేయాలని పేర్కొన్నారు.

అనంతరం రైతు ఖాతాకు 75 శాతం రాయితీ జమ చేస్తామన్నారు. మిరియాలు, అల్లం, పసుపు సాగు చేస్తున్న గిరిజన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 90 శాతం రాయితీపై అందిస్తామన్నారు. ఐటీడీఏ కార్యాలయ ఆవరణలోని స్పైసెస్‌ బోర్డు విభాగంలో అక్టోబరు 10వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలన్నారు. దరఖాస్తులకు ఆధార్‌ కార్డు, కుల ధ్రువీకరణపత్రం, బ్యాంకు పాస్‌ పుస్తకం మొదటి పేజీ, పోడు పట్టా లేదా భూమి పట్టా జెరాక్స్‌ కాపీలను (కనీసం 1 ఎకరం భూమి) మొబైల్‌ ఫోన్‌ నంబరు, పాస్‌పోర్టు సైజు ఫొటోలను దరఖాస్తుకు జత చేయాలని కలెక్టర్‌ దినేశ్‌కుమార్‌ పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్‌ ఏఎస్‌.దినేశ్‌కుమార్‌

పర్యాటకంపై ప్రత్యేక శ్రద్ధ

- 'స్వదేశీ దర్శన్‌' పేరిట అరకులోయ- లంబసింగి టూరిజం సర్క్యూట్‌
- పర్యావరణ హితంగా పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలి
- కలెక్టర్‌ ఏఎస్‌ దినేశ్‌కుమార్‌ ఆదేశం

పాడేరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అరకులోయ ప్రాంతం నుంచి పాడేరు మీదుగా లంబసింగి వరకు ఉన్న పర్యాటక ప్రాంతాలను కలుపుకొని 'స్వదేశీ దర్శన్‌' పేరిట టూరిజం సర్క్యూట్‌ రూపొందించాలని అధికారులను కలెక్టర్‌ ఏఎస్‌ దినేశ్‌కుమార్‌ ఆదేశించారు. జిల్లాలో పర్యాటకాభివృద్ధిపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అనేక అవకాశాలున్నాయని, వాటిని గుర్తించి భవిష్యత్తులో పర్యాటకాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై డీపీఆర్‌ రూపొందించాలన్నారు. చిన్నతరహా నుంచి పెద్ద తరహా వరకు ఉన్న పర్యాటక ప్రాంతాలను గుర్తించాలని, అక్కడ చేపట్టే చర్యలతో గిరిజన యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధిచేకూరాలన్నారు. ఎక్కడ పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టినా పర్యావరణ హితంగా ఉండాలని, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. పర్యాటక ప్రదేశాల్లో పారిశుధ్యం మెరుగుగా ఉండడంతో పాటు పర్యాటకులకు సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రైవేటు వ్యక్తులు సైతం వసతి, ఇతర సదుపాయాలు కల్పించే వివరాలు తెలిసే ఒక వెబ్‌సైట్‌ను రూపొందించాలన్నారు. ఇప్పటికే బొర్రా గుహలు అభివృద్ధికి రూ.30 కోట్లు మంజూరయ్యాయని, డుంబ్రిగుడ మండలం అంజోడ తోటల్లో నాలుగున్నర ఎకరాల్లో కారవాన్‌ పార్క్‌ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని, కళాశాలల్లో యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసి పర్యాటక రంగంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో గిరిజన యువతతో టూరిజం కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఉన్న అన్ని అవకాశాలను గుర్తించి, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్‌ తెలిపారు. ఈ సమావేశంలో జేసీ ఎంజే అభిషేక్‌గౌడ్‌, ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌, సబ్‌ కలెక్టర్‌ శౌర్యమన్‌పటేల్‌, రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్‌కలెక్టర్‌ కల్పశ్రీ, పర్యాటకశాఖ ఆర్‌డీ శ్రీనివాస్‌, జిల్లా టూరిజం అధికారి జి.దాసు, డీపీవో టి.కొండలరావు, డీపీఆర్‌వో పి.గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.



పాడేరు ఘాట్‌లోని వంట్లమామిడి వద్ద సీతాఫలాల విక్రయాలు

జోరుగా సీతాఫలాల విక్రయాలు

- పరిమాణాన్ని బట్టి ఒక్కో కాయ రూ.5 నుంచి రూ.15 చొప్పున అమ్మకం
- సేంద్రియ పద్ధతిలో పండించడంతో గిరాకీ
- మైదాన ప్రాంత వర్తకులు కొనుగోలు చేసి ఇతర జిల్లాలకు రవాణా

(పాడేరు- ఆంధ్రజ్యోతి)



ఏజెన్సీలో ప్రస్తుతం సీతాఫలాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎక్కడ చూసినా సీతాఫలాల బుట్టలు కనిపిస్తున్నాయి. పాడేరు, అనంతగిరి మండలాల్లో వాటి క్రయ విక్రయాలు జోరందుకున్నాయి.

ఏజెన్సీ వ్యాప్తంగా సుమారు 250 ఎకరాల్లో సీతాఫలాల తోటల పెంపకాన్ని గిరిజన రైతులు చేపడుతున్నారనేది ఒక అంచనా. పాడేరు మండలం వంట్లమామిడి, సలుగు, దేవాపురం, ఐనాడ పంచాయతీల పరిధిలో గ్రామాల్లో, అనంతగిరి మండలం కాశీపట్నం, కొత్తూరు, డముకు, వాలాసి, పినకోట, పెదకోట పంచాయతీల్లోని గ్రామాల్లో గిరిజన రైతులు వాటి పెంపకం చేపడుతున్నారు. వాటిని స్థానికంగా గ్రామాల్లో, వారపు సంతల్లో విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. అలాగే మైదాన ప్రాంతానికి చెందిన వర్తకులు సైతం ఏజెన్సీ ప్రాంతానికి వచ్చి రైతుల నుంచి వాటిని కొనుగోలు చేసి అనకాపల్లి, విశాఖపట్నం, తుని, కాకినాడ, విజయవాడ ప్రాంతాల్లోని మార్కెట్లలో విక్రయిస్తున్నారు. పశ్చిమబంగా ప్రాంతానికి కూడా ఎగుమతి చేస్తుంటారు. కాయ సైజును బట్టి రూ.5 నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నారు. ఏజెన్సీలోని సీతాఫలాలు రుచిగా ఉండడంతో పాటు సేంద్రియ పద్ధతిలో పండిస్తుండడంతో ఇతర ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది.

ఏజెన్సీలో మార్కెటింగ్‌ సదుపాయం శూన్యం

ఏజెన్సీలో వందల గ్రామాల్లో గిరిజనులు సీతాఫలాలు పండిస్తున్నప్పటికీ కనీసం మార్కెటింగ్‌ సదుపాయం లేని పరిస్థితి కొనసాగుతున్నది. తమకు అనుకూలంగా వారపు సంతల్లో లేదా తమ వద్దకు వచ్చే వర్తకులకే వాటిని విక్రయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అందువల్ల వాటికి స్థిరమైన ధర లేకుండా అప్పటికప్పుడు వర్తకుల డిమాండ్‌ ఆధారంగానే వాటిని విక్రయించుకుంటున్నారు. ప్రభుత్వ పరంగా ఎటువంటి సాయం అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమకున్న అవకాశాలను సద్వినియోగం ... మిగతా 8వ పేజీలో

విద్యాశాఖలో కలకలం!

- ఏసీబీ వలలో ఓపెన్‌ స్కూల్స్‌ కోఆర్డినేటర్‌
- పరీక్షా కేంద్రం మంజూరుకు డబ్బులు డిమాండ్‌
- రూ.30 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- అనకాపల్లి జిల్లా విద్యాశాఖ వివిధ విభాగాల్లో సోదాలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)



ఏసీబీకి పట్టుబడిన ఓపెన్‌ స్కూల్స్‌ కోఆర్డినేటర్‌ కుమార్‌

అనకాపల్లి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఓపెన్‌ స్కూల్స్‌ విభాగం జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడడం విద్యా శాఖలో కలకలం రేపింది. కొప్పాకలోని డీఈవో కార్యాలయంలోనే రూ.30 వేలు లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయిన సార్వత్రిక పాఠశాలల సమన్వయకర్త ఒ.కుమార్‌పై కేసు నమోదు చేశారు. ఏసీబీ కోర్టులో హాజరు పర్చిన అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఓపెన్‌ స్కూల్స్‌ విభాగంలో తనిఖీలు ముగించిన ఏసీబీ అధికారులు.. లంచం సొమ్ములో ఎవరెవరికి, ఎంతెంత వాటాలు ఉన్నాయన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఎలమంచిలికి చెందిన పి.ఈశ్వరదత్తు అనే ఒక ప్రైవేటు కళాశాల ప్రిన్సిపాల్‌ పదో తరగతి, ఇంటర్మీడియట్‌ ఓపెన్‌ స్కూల్‌ పరీక్షల నిర్వహణ కేంద్రం కోసం విద్యా శాఖకు చెందిన ఆన్‌లైన్‌ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతి పొందారు. అయితే ఈ కేంద్రానికి సంబంధించిన డిజిటల్‌ కీని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఓపెన్‌ స్కూల్స్‌ కో-ఆర్డినేటర్‌ క్షేత్ర పర్యటన చేసిన తరువాత ఇవ్వాల్సి ఉంది. ఈశ్వరదత్తు వారం రోజుల కిందట కోఆర్డినేటర్‌ కుమార్‌ను సంప్రదించారు. డిజిటల్‌ కీ ఇవ్వాలంటే రూ.35 వేలు లంచంగా ఇవ్వాలని ... మిగతా 8వ పేజీలో

అల్లూరి జిల్లా రిజిస్ట్రార్‌గా రామలక్ష్మి

- అనకాపల్లి డీఆర్‌గా ఉమామహేశ్వరి
- విశాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా ఉపేంద్ర
- డీఐజీ బాలకృష్ణ ఇక్కడే కొనసాగింపు
- నేడు సబ్‌ రిజిస్ట్రార్‌ బదిలీలకు మార్గదర్శకాలు?

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో డీఐజీలు, జిల్లా రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. కాకినాడ జిల్లా రిజిస్ట్రార్‌ పి.రామలక్ష్మి పట్నాయక్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించారు. విశాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా ఉన్న ఎం.సృజనను తాడేపల్లి బదిలీ చేశారు. ఒంగోలులో పనిచేస్తున్న టి.ఉపేంద్రను విశాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించారు. శ్రీకాకుళం జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కె.మన్మథరావును విశాఖ జిల్లా మార్కెట్‌ విలువలు, ఆడిట్‌ రిజిస్ట్రార్‌గా వేశారు. కర్నూలు జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న పి.ఉమామహేశ్వరిని అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించారు. అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సీహెచ్‌.జానకీదేవిని నంద్యాల జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. విశాఖ డీఐజీగా పనిచేస్తున్న బాలకృష్ణను ఇక్కడే కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

మార్గదర్శకాలకు కసరత్తు

సబ్‌ రిజిస్ట్రార్ల బదిలీల కోసం ఇంకా మార్గదర్శకాలు తయారు చేయలేదు. బుధవారం రాత్రికి గాని, గురువారం కాని వస్తాయని అంటున్నారు. విశాఖపట్నం జిల్లాలో పనిచేయడానికి అనేకమంది ఆసక్తి చూపిస్తున్నారు. ప్రభుత్వం ఐదేళ్లు ఒకేచోట సర్వీసు పూర్తి చేసుకున్నవారికి బదిలీ చేయాలని సూచించింది. అయితే రెండేళ్లు దాటిన వారి నుంచి కూడా దరఖాస్తులు ఆహ్వానించింది. నేరుగా ఉన్నతాధికారులే బదిలీ చేస్తారా?, కౌన్సెలింగ్‌ నిర్వహిస్తారా? అనేది ఇంకా స్పష్టత లేదు. కొన్ని జిల్లాల్లో సబ్‌ రిజిస్ట్రార్‌ పోస్టుల కోసం లక్షల రూపాయలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారని వార్తలు రావడంతో ప్రభుత్వం బదిలీలను సీరియస్‌గా తీసుకుంది. ఆరోపణలకు తావు లేని విధంగా చేయాలని భావిస్తోంది. సబ్‌ రిజిస్ట్రార్ల పోస్టులకు కూడా ఎమ్మెల్యేలు సిఫారసు లేఖలు ఇచ్చారు. వాటిని ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకుంటారా?, లేదా? అనేది చూడాలి. జిల్లా రిజిస్ట్రార్ల బదిలీల్లో కొన్నింటిని రాజకీయ సిఫారసులను దృష్టిలో పెట్టుకొని చేశారు.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో కూలీ మృతి



మృతిచెందిన వెంకటరమణ

గొలుగొండ, సెప్టెంబరు 18: కూలి పనికి వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషాద సంఘటన మండలంలోని చినపెదపేటలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గొలుగొండ మండలం ఏటిగైరంపేటకు చెందిన పూటా వెంకటరమణ (48) బుధవారం ఉదయం రోలుగుంట మండలం చినపెదపేటలోని ఒక రైతుకు సంబంధించిన పొలంలో పనికి వెళ్లాడు. పొలం పనులు చేస్తుండగా త్రీఫేస్ విద్యుత్‌లైన్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరాడు. మిగతా కూలీలు అతడిని వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. రోలుగుంట ఎస్ఐ రామకృష్ణారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి బంధువులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

50 కిలోల గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్టు

» కారు, మూడు సెల్‌ఫోన్లు సీజ్



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

చీడికాడ, సెప్టెంబరు 18: మండలంలోని అప్పలరాజుపురం చెరకు కాటా వద్ద 50 కిలోల గంజాయిని పట్టుకొని ఇద్దరు నిందితులను చోడవరం కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ బి.సతీష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.

కర్ణాటకకు చెందిన పి.వీర (42), చిన్నస్వామి (44) ఈ నెల 15న కారులో అల్లూరి జిల్లా పెదబయలు మండలం బోమంగి గ్రామానికి వచ్చారు. ఆ గ్రామంలో ఒక వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి ఈ నెల 17న కోనాం మీదుగా అప్పలరాజుపురం వైపు వస్తుండగా, వారి కారు తనిఖీ చేయగా 50 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో వీరిద్దరిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. కారు, మూడు సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కె.కోటపాడు సీఐ పైడంనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

30 కిలోల గంజాయి స్వాధీనం

» ముగ్గురి అరెస్టు



పట్టుబడిన నిందితులు, గంజాయితో పోలీసులు

సబ్బవరం, సెప్టెంబరు 18: సబ్బవరం మీదుగా విశాఖపట్నానికి తరలిస్తున్న 30 కిలోల గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసు కుని ముగ్గురిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో ఎస్ఐ పి.సింహాచలం సిబ్బందితో ఎన్టీఆర్ జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. చోడవరం నుంచి సబ్బవరం వైపు ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు వస్తుండగా వారిని ఆపి ప్రశ్నించారు. వీరిలో ఓ వ్యక్తి పరారయ్యాడు. మరో వ్యక్తి ముక్కా లోహిదాస్‌గా పోలీసులు గుర్తించారు. అతనిని ప్రశ్నించగా వెనుక గంజాయితో వస్తున్న ఆటోకు పైలట్‌గా వస్తున్నట్టు చెప్పాడు. వెనుక వస్తున్న ఆటోను ఆపి పరిశీలించగా అందులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. ఆటోలో తనిఖీలు చేయగా 30 కిలోల గంజాయి పట్టుబడింది. ఆటోలో ఉన్న గుద్దె సురేశ్, కిముడు మోహన్‌లను ప్రశ్నించగా ముంచంగిపుట్టు మండలం పెదగూడెం నుంచి విశాఖపట్నంలో ఓ వ్యక్తికి అప్పగించేందుకు తరలిస్తున్నట్టు చెప్పారు. కాగా పరారైన వ్యక్తితో పాటు మరో ముగ్గురు తప్పించుకున్నారని, వారి కోసం గాలిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. గంజాయితో పాటు నిందితులను పట్టుకున్న సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐ సింహాచలంతో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అదుపు తప్పిన ప్రైవేటు బస్సు

» పలువురికి గాయాలు



పంట పొలాల్లోకి దూసుకు వెళ్లిన బస్సును పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తూరు, సెప్టెంబరు 18: అనకాపల్లి మండలం మార్టూరు గ్రామం సమీపంలో ప్రైవేటు బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న పంట పొలంలోకి దూసుకెళ్లింది. అనకాపల్లి రూరల్ ఏఎస్ఐ సింగంపల్లి భాస్కరరావు, స్థానికులు తెలిపిన వివరాలివి. చీడికాడ నుంచి అచ్యుతాపురం బ్రాండెక్స్ కంపెనీకి ఉద్యోగులను తీసుకెళుతున్న బస్సు మార్టూరు గ్రామ సమీపంలో వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 45 మందిలో 10 మంది మహిళా కార్మికులు స్వల్పంగా గాయపడగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.. వీరికి అనకాపల్లిలో ఉన్న పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రథమ చికిత్స అందించి ఇంటికి పంపించారు. ఈ సంఘటనకు సంబంధించి బస్సులో ప్రయాణిస్తున్న కార్మికురాలు దేవర రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ చెప్పారు.

ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టివేత

» రూ.10 వేల చొప్పున జరిమానా



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

మాకవరపాలెం, సెప్టెంబరు 18 : సర్పానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్టు ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు. ఒక్కో ట్రాక్టరుకు రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్టు చెప్పారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా అక్రమ ఇసుక వ్యాపారం నిర్వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554



కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా బుధవారం మంగళగిరిలోని ఒక ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, కొణతాల రామకృష్ణ, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గణబాబు, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు.

కబడ్డీ పోటీల్లో 'పేట' విద్యార్థుల ప్రతిభ



కబడ్డీ పోటీల్లో బంగారు పతకం సాధించిన విద్యార్థులు

పాయకరావుపేట, సెప్టెంబరు 18: సీబీఎస్ఈ నిర్వహించిన క్లస్టర్-7 కబడ్డీ పోటీల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడంతో పాటు త్వరలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని బుధవారం విద్యా సంస్థల యాజమాన్యం అభినందించింది.

ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు గద్వాల్‌లోని ఎస్ఆర్.విద్యానికేతన్‌లో సీబీఎస్ఈ బోర్డు క్లస్టర్-7(ఆంధ్రా, తెలంగాణ) కబడ్డీ పోటీల్లో అండర్-14, అండర్-19 బాలుర విభాగాల్లో తమ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించడంతోపాటు వచ్చే నెల 17 నుంచి 20వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్ జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని యాజమాన్యం తెలిపింది. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్-7 పోటీల్లో 30 మంది తమ విద్యార్థులు బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపింది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్‌తోపాటు పలువురు ఉపాధ్యాయులు, కోచ్‌లు లక్ష్మణ్, చినరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

న్యాయ విద్యార్థులకు సామాజిక బాధ్యత అవసరం

» గోవా లా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరావు



ప్రొఫెసర్ ఆర్.వెంకటరావును జ్ఞాపికతో సత్కరిస్తున్న లా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు

సబ్బవరం, సెప్టెంబరు 18: న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులకు సామాజిక బాధ్యత అవసరమని గోవా ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ ఆర్.వెంకటరావు అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో కొత్తగా మూడేళ్ల న్యాయ విద్యను ప్రవేశ పెట్టిన సందర్భంగా ఆ విద్యార్థులకు బుధవారం వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశ్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటరావు మాట్లాడుతూ సమాజంపై అవగాహన పెంచుకునేందుకు న్యాయ విద్యార్థులందరూ తప్పనిసరిగా చరిత్ర, సామాజిక శాస్త్రం, పొలిటికల్ సైన్స్‌లపై పట్టు సాధించాలని సూచించారు. ఇంజనీరింగ్, చార్టెడ్ అకౌంటెంట్లు న్యాయ శాస్త్రంపై పట్టు కోసం ఆసక్తి చూపిస్తున్నారన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ పురోగతిని సమీక్షించుకుంటూ ముందుకు సాగినప్పుడే వ్యక్తిగతంగా, సామాజికంగా అభివృద్ధి సాధ్య మన్నారు. వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ దేశంలో మూడేళ్ల న్యాయ విద్యను అందిస్తున్న మూడవ విశ్వవిద్యాలయం డీఎస్ఎన్ఎల్‌యూ అన్నారు. ఈ విశ్వవిద్యాలయం నుంచి ప్రతి ఏడాది 70 లక్షల విలువైన జర్నల్స్, ఆన్లైన్ రిసోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, విద్యార్థులు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, అకడమిక్ డైరెక్టర్ సోమా భట్టాచార్య, ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ కె.సుధ, డాక్టర్ దయానందమూర్తి, డాక్టర్ టీవై నిర్మలాదేవి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రమాదకర ప్రయాణాలు

» సరిపడా ఆర్టీసీ బస్సులు లేక ఇబ్బందులు



ఆర్టీసీ బస్సు ఫుట్‌పాత్‌పై నిలబడి ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట, సెప్టెంబరు 18: పాయకరావుపేటలోని వివిధ విద్యా సంస్థల్లో చదువుతున్న వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు రోజూ ఆర్టీసీ బస్సుల్లో ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. పాయకరావుపేట పట్టణంలో ఉన్న పలు ప్రైవేటు విద్యా సంస్థలతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వివిధ కళాశాలల్లో చదువుతున్న మండలంలోని జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న గ్రామాలతోపాటు నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు రోజూ ఆర్టీసీ బస్సులు, ఆటోలు, వివిధ వాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో అత్యధికులు ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణాలు సాగిస్తుండడంతో ఉదయం, సాయంత్రం విద్యార్థులతో బస్సులు రద్దీగా ఉంటున్నాయి. ముఖ్యంగా సాయంత్రం సమయంలో ఇళ్లకు వెళ్లే విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఆర్టీసీ సర్వీసులు లేనికారణంగా ఆయా సమయాల్లో ఆర్టీసీ బస్సుల్లో ఫుట్‌పాత్‌పై నిలబడి మరీ ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. విద్యార్థులను తీసుకువెళ్లే పలు ఆటోల్లో కూడా 20 మందికిపైగా విద్యార్థులు కిక్కిరిసి కూర్చుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ వాహనాలన్నీ జాతీయ రహదారిపైనే ఎక్కువ సమయం ప్రయాణం చేస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి విద్యార్థులను తీసుకెళ్లే వాహనాలు పరిమితికి మించి ఎక్కించుకోకుండా చర్యలు తీసుకోవడంతోపాటు సాయంత్రం సమయంలో ఆర్టీసీ సర్వీసులు పెంచాలని కోరుతున్నారు.

గిరినాగు హల్‌చల్



గిరి నాగును పట్టుకున్న స్నేక్ క్యాచర్ కృష్ణ

దేవరాపల్లి, సెప్టెంబరు 18 : మండలంలోని రైవాడ శివారు శంభువానిపాలెంలో గిరి నాగు హల్ చేసింది. సుమారు 15 అడుగుల గిరి నాగు కనబడడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురయ్యారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. మరోవైపు.. విజయనగరం జిల్లా వేపాడ మండలం కొప్పలవానిపాలేనికి చెందిన స్నేక్ క్యాచర్ కృష్ణకు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి గంటల తరబడి శ్రమించి పట్టుకోగలిగారు. ఆ పామును దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. కాగా, ఈ ప్రాంతంలో గిరినాగులు అడపాదడపా కనపిస్తుంటాయని కొందరు చెప్పారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాల విడుదల

కొత్తూరు, సెప్టెంబరు 18: ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి ఫలితాలు బుధవారం విడుదలయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ వివింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ కోర్సుల పరీక్షా ఫలితాలను విజయవాడలో ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ విడుదల చేశారని తెలిపారు. అభ్యర్థులు తమ ఫలితాలను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని ఆమె తెలిపారు.

భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డిపై క్రమశిక్షణ చర్యలు

» ప్రభుత్వ భూమికి సంబంధించి తప్పుడు నివేదిక సమర్పించారని అభియోగం

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది. విశాఖ రూరల్ మండలం మధురవాడ సర్వే నంబరు 133లో 3.47 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి తప్పుడు నివేదిక సమర్పించినట్టు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంలో ఆయనతోపాటు మరో ముగ్గురు ఉద్యోగులపై చర్యలకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే దీనికి సంబంధించి బుధవారం జారీచేసిన జీవో ఓపెన్ కాలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలీస్ జాగిలాలతో తనిఖీలు



అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో పోలీసు జాగిలంతో తనిఖీ

కొత్తూరు, సెప్టెంబరు 18 : జిల్లాలో పార్శిల్ సర్వీసుల ద్వారా జరిగే మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పోలీసు జాగిలాలతో బుధవారం రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించామని ఎస్పీ ఎం.దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లిలోని ఆర్టీసీ, ప్రైవేటు పార్శిల్ సర్వీసుల వద్ద జాగిలాలతో తనిఖీలు జరిపామని పేర్కొన్నారు. అలాగే, రైల్వేస్టేషన్, చెక్‌పోస్టుల వద్ద కూడా విస్తృత తనిఖీలు చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పట్టణ ఎస్ఐ అలీ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నంలో..



పోలీస్ జాగిలంతో ఆర్టీసీ పార్శిల్ గోదాములో తనిఖీ చేస్తున్న పోలీసులు

నర్సీపట్నం, సెప్టెంబరు 18 : మాదక ద్రవ్యాలను కనిపెట్టే పోలీసు జాగిలంతో పోలీసులు ఆర్టీసీ పార్శిల్ సర్వీసు గోదాములో తనిఖీ చేశారు. బుధవారం గంజాయి అక్రమ రవాణా నిరోధించే క్రమంలో ఎస్పీ ఆదేశాలతో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్సై సుధాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అచ్యుతాపురం, సెప్టెంబరు 18 : రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్టు సీఐ నమ్మి గణేష్ తెలిపారు. గాజువాక సమీపంలోని మల్కాపురానికి చెందిన జె.అప్పలనాయుడు (50) అచ్యుతాపురం వైపు బైక్‌పై వస్తుండగా, మడుతూరు జంక్షన్ వద్ద ప్రమాదానికి గురయ్యాడన్నారు. తీవ్ర గాయాలకు గురైన అతనిని విశాఖ కేజీహెచ్‌కు తరలించిగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు చెప్పారు.

'సింహాద్రి' మొదటి యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, సెప్టెంబరు 18: ఇక్కడి సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ) లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌లోని ఉత్పత్తిని బుధవారం పునరుద్ధరించారు. ఇదే యూనిట్‌కు సంబంధించి బాయిలర్ ట్యూబ్‌ల్లో రంధ్రాలు ఏర్పడడంతో గత శనివారం అర్ధరాత్రి ఉత్పత్తి అర్థాంతరంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం ప్లాంట్‌లోని అన్ని యూనిట్‌ల్లోనూ ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు తెలిపారు.

రచయిత్రి గాయత్రీదేవికి బిరుదు ప్రదానం



గాయత్రీదేవికి మధురకవన ధుని బిరుదు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

నక్కపల్లి, సెప్టెంబరు 18: ఆధ్యాత్మిక, సాహిత్య రంగాల్లో సేవలందిస్తూ, ఎన్నో రచనలు చేసిన మండలంలోని ఉపమాక గ్రామానికి చెందిన డాక్టర్ జి.గాయత్రీదేవి రచించిన శతకగాయత్రి గ్రంథావిష్కరణ హైదరాబాద్‌లో బుధవారం ఘనంగా జరిగింది. బైరామల్‌గూడ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో తొలుత ఈ గ్రంథాన్ని తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు కవులు ఆవిష్కరించారు. అనంతరం గాయత్రీదేవికి మధురకవన ధుని బిరుదును ప్రదానం చేసి, సత్కరించారు. ఆమె సేవలను ప్రముఖ కవులు కంది శంకరయ్య, చింతా రామకృష్ణ, గౌరీ శంకరశర్మ, తోపెల్ల బాల సుబ్రహ్మణ్యం తదితరులు ప్రశంసించారు.

బోధన పద్ధతులు మెరుగుపరుచుకోవాలి

» డీఈవో వెంకట లక్ష్మమ్మ



స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా విద్యా శాఖాధికారిణి వెంకట లక్ష్మమ్మ

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 18: టీచ్‌టూల్ అంశాలకు అనుగుణంగా బోధన పద్ధతులను ఉపాధ్యాయులు మెరుగుపరుచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకట లక్ష్మ మ్మ సూచించారు. మండలంలోని పూడిమడక హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఇంగ్లీషు సబ్జెక్టు స్కూల్ కాంప్లెక్సు ఉపాధ్యాయుల సమావేశానికి ఆమె హాజరయ్యారు. రిసోర్సు పర్సన్‌లు స్కూల్ కాంప్లెక్సులో చర్చించి నిర్ణయించిన అంశాలపై అర్థవంతమైన చర్చను నిర్వహించాలన్నారు. అనంతరం పూడిమడక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థుల నోట్సును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పీవీ రామశేషు, రిసోర్సు పర్సన్‌లు ఎస్ఎస్ఎన్ నాగేశ్వరరావు, ఎల్‌పీవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'గీత కార్మికుల ఉపాధికి నూతన ఎక్సైజ్ పాలసీ రూపొందించాలి'



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గీత కార్మికులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18: ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మికుల ఉపాధి అవకాశాలు పెంచేందుకు నూతన ఎక్సైజ్ పాలసీ రూపొందించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ జిల్లా కార్యాలయం ఎదుట కల్లుగీత కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా దేవుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారం సందర్భంగా గీత కార్మికులకు 20 శాతం బ్రాందీ షాపుల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం పది శాతం మాత్రమే కేటాయిస్తామని చెప్పడం అన్యాయమన్నారు. గీత కార్పొరేషన్ ద్వారా కార్మికులు షేర్ ధనం కట్టి ఉన్నారని, మండలాల్లో బ్రాందీ షాపులు ఏర్పాటుకు 50 శాతం రాయితీ కల్పించి టెండర్ వేసే విధంగా పాలసీ రూపొందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

లక్కవరపుపేటలో భారీ కొండచిలువ హతం



గిరిజనులు హతమార్చిన భారీ కొండ చిలువ

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 18: మండలంలోని లక్కవరపుపేట గ్రామ శివారులో భారీ కొండ చిలువను స్థానికులు హతమార్చారు. బుధవారం మధ్యాహ్నం పొలం పనుల్లో నిమగ్నమైన గిరిజనులకు అతి సమీపంలోకి కొండచిలువ వచ్చింది. దీంతో వారు పనులు ఆపేసి భయంతో పరుగులు పెట్టారు. అయితే కొండ చిలువ గ్రామంలోకి వస్తే కోళ్లు, మేకలను మింగేస్తుందని, చిన్నపిల్లలకు కూడా హాని కలుగుతుందన్న భయంతో కొంతమంది యువకులు కర్రలతో కొట్టి కొండచిలువను చంపేశారు.

అసంపూర్తి భవనాలకు మోక్షం

వైసీపీ పాలనలో మధ్యలో నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు

మంప, శరభన్నపాలెం ఆశ్రమాల్లో మూడేళ్లూ ముందుకుసాగని పనులు

వసతి సదుపాయాలు లేక ఐదేళ్లూ ఇబ్బందులు పడ్డ విద్యార్థులు

కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే పనులు పునఃప్రారంభం



పిల్లర్లతో నిలిచిపోయిన మంప ఆశ్రమ పాఠశాల వంట గది నిర్మాణం

కొయ్యూరు, సెప్టెంబరు 18: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల అదనపు భవనాలకు మోక్షం లభించింది. వైసీపీ పాలనలో ఐదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన మంప, శరభన్నపాలెం పాఠశాలల అదనపు భవన నిర్మాణాలు పునఃప్రారంభమయ్యాయి. 2019కు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆశ్రమ పాఠశాలల్లో ఈ భవనాలకు నిధులు మంజూరయ్యాయి. తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం చెల్లింపులు జరపకపోవటంతో భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ నిధులతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మంప గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల అదనపు వసతి భవన నిర్మాణాలకు రూ1.6 కోట్లు, కిచెన్ కమ్ డైనింగ్ భవనానికి రూ.40 లక్షలు, శరభన్నపాలెం ఆశ్రమ పాఠశాల అదనపు వసతి భవన నిర్మాణాలకు రూ.2 కోట్లు మంజూరు చేసింది. వీటి నిర్మాణ పనులను గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు పనులను అప్పగించారు. దీంతో వారు మంపలో డార్మిటరీ రూ1.3 కోట్ల మేర పనులు నిర్వహించగా, శరభన్నపాలెంలో రూ.90 లక్షల మేర పనులు పూర్తి చేశారు. మంపలో డైనింగ్ కమ్ కిచెన్‌షెడ్డుకు సంబంధించి పునాదులు వేశారు. అనంతరం ప్రభుత్వం మారినా పనులు నిలుపుచేయలేదు. 2020లో అప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించి చెల్లింపులకు వీలుగా ఎం బుక్ రికార్డు మేరకు పూర్తయిన నిర్మాణాల మేర బిల్లులు పెట్టారు. వీటిని ఇంజనీరింగ్ అధికారులు ప్రభుత్వానికి సమర్పించినా, ఒక్క రూపాయ కూడా చెల్లించలేదు.

దీంతో మిగిలిన పనులు గత మూడేళ్లుగా అసంపూర్తిగా నిలిచాయి. ఫలితంగా రెండు పాఠశాలల్లోనూ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తరగతి గదుల్లోకి నీరు చేరడంతో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు



ఐదేళ్ల అనంతరం ప్రారంభమైన మంప అదనపు వసతి భవనాల పనులు

ఎదుర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాలకు కేటాయించిన నిధులు వేరే సంక్షేమ పథకాలకు మళ్లించడంతో సమస్యలు తలెత్తాయి. ఆరు నెలల క్రితం తిరిగి అధికారం చేపట్టిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం గతంలో అధికారంలో ఉండగా చేపట్టిన అభివృద్ధి పనులపై సమగ్ర నివేదిక రప్పించుకుంది. ఇందులో భాగంగా మండలంలో మంప, శరభన్నపాలెం ఆశ్రమ పాఠశాలల్లో పనులు సత్వం పూర్తి చేయించేలా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించడంతో పాటు నిధులు మంజూరు చేయడంతో భవన నిర్మాణాలను పునఃప్రారంభించారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఉపాధ్యాయులు రా(లే)క.. చదువు లేక!

▸▸ సొట్టడివలస పాఠశాలలో విద్యార్థుల దుస్థితి

▸▸ పిల్లలతో కలిసి తల్లిదండ్రుల ఆందోళన

అనంతగిరి, సెప్టెంబరు 18: బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పాలని ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు హితబోధ చేసే గురువులు, కొన్ని చోట్ల పిల్లలు చదువుకుంటామంటే పాఠాలు చెప్పడానికి రావడం లేదని అసహనం వ్యక్తం చేస్తూ సొట్టడివలసలో తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. మండలంలోని రొంపల్లి పంచాయతీ సొట్టడివలస గ్రామంలో ఉన్న జీపీఎస్ టీబ్ల్యూ పాఠశాలలో సొట్టడివలసతో పాటు కుందేలగుడ్డి, కోటపర్తివలస గ్రామాలకు చెందిన 25 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల పునఃప్రారంభం నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు ఉపాధ్యాయుడు వచ్చేవారని, తరువాత నుంచి పాఠశాలకు రావడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు మండిపడ్డారు. ఉపాధ్యాయులు రాకపోవడంతో మధ్యాహ్న భోజన పథకం అమలు కావడం లేదని, దీంతో పిల్లలను కొండపోడుకు తీసుకువెళ్లాల్సిన దుస్థితి దాపురించిందని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సొట్టడివలస పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించి, సక్రమంగా విధులకు వచ్చి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేలా చూడాలని వారు వేడుకుంటున్నారు.

గిరిజన ప్రాంతంలో జనసేన బలోపేతం

▸▸ పార్టీలో 200 మంది వైసీపీ నాయకులు, గిరిజనులు చేరిక

▸▸ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంపూరి గంగులయ్య



వైసీపీ కార్యకర్తలను కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానిస్తున్న గంగులయ్య

చింతపల్లి, సెప్టెంబరు 18: గిరిజన ప్రాంతంలో జనసేన బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్టు పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంపూరి గంగులయ్య అన్నారు. మండలంలోని బెన్నవరం పంచాయతీ పోతురాజుగుమ్మలు గ్రామంలో బుధవారం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు వంతలరామ్, మర్రి వశంత కుమార్, పాల్కె లక్ష్మణరావు, వంతల కేశ్వరరావు, బచ్చల బొజ్జన్నదొర, డిప్పల రాజుబాబు, గెమ్మెల చిన్నారావు, కొర్ర అప్పారావు, పాల్కె సింగ్రుతో పాటు 200 మంది వైసీపీ మద్దతుదారులు, గిరిజనులు పార్టీలో చేరారు. వారికి గంగులయ్య పార్టీ కండువకప్పి స్వాగతించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్డీయే కూటమి పాలనలో భాగస్వామ్యమైన జనసేన పార్టీలో చేరేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. జనసేన సభ్యత్వాల నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉగ్రంగి లక్ష్మణరావు, ఉల్లి సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

కాఫీ రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి

▸▸ గిరిజన కాఫీ రైతుల సంఘం జాతీయ ప్రతినిధులు చినబాబు, లక్కు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చినబాబు, లక్కు

అరకులోయ, సెప్టెంబరు 18: భారీ వర్షాల కారణంగా మన్యంలో కాఫీ తోటలు, అంతర్గత పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, సంబంధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని గిరిజన కాఫీ రైతులసంఘం జాతీయ ప్రతినిధి గెమ్మెలి చిన బాబు, జాతీయ ఉపాధ్యక్షుడు పాలికి లక్కు డిమాండ్ చేశారు. బుధవారం అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో విలేకర్లతో వారు మాట్లాడారు. తుఫాన్ వల్ల చింతపల్లి, జీకే.వీధి మండలాల్లో ఎక్కువ మంది కాఫీ రైతులకు నష్టం వాటిల్లిందని వాపోయారు. దీంతో గిరి రైతులు మానసిక ఆందోళనతో కొట్టుమిట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మన్యంలో అల్లం, పసుపు, వరి, ఇతర పంటలు కూడా దెబ్బతిన్నాయని చెప్పారు. ఆయా రైతులకు పంట నష్టపరిహారం ప్రకటించలేదని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి న్యాయబద్ధంగా పరిహారం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాఫీ రైతుల సంఘం జిల్లా ప్రతినిధులు గురుమూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర సంరక్షణ అందరి బాధ్యత

చింతపల్లి, సెప్టెంబరు 18: ఓజోన్ పొరను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి చెప్పారు. బుధవారం కళాశాలలో కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఓజోన్ సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సూర్యుని నుంచి వచ్చే హానికరమైన కిరణాల నుంచి భూమిని రక్షిస్తుందని, దీంతో భూమిపై నివసిస్తున్న జీవరాసులకు రక్షణ కలుగుతుందన్నారు. కాలుష్యం, రసాయనాల వినియోగం వల్ల ఓజోన్ పొరకు హాని కలుగుతుందన్నారు. ఓజోన్ పొరకు హాని కలిగే విధమైన చర్యలను చేపట్టకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసపాత్రుడు, అధ్యాపకులు డాక్టర్ కేజియా, డాక్టర్ రమణ, కె.లీలపావని, జగదీశ్ బాబు, రవీంద్రనాయక్, పీఆర్‌టీయూ జీకే వీధి అధ్యక్షుడు ముర్ల వెంకటరమణ పాల్గొన్నారు.

పారిశ్రామిక విజ్ఞాన యాత్రకు గిరి విద్యార్థులు

పాడేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పారిశ్రామిక విజ్ఞాన యాత్రను బుధవారం చేపట్టారు. ఐటీఐ, పాలిటెక్నిక్ వంటివి చదువుతున్న పాడేరు, చింతపల్లి ప్రాంతానికి చెందిన 80 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వారిని బుధవారం ఒక ప్రత్యేక బస్సులో విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాల్లోని పరిశ్రమలకు తీసుకువెళ్లి, ఆయా పరిశ్రమల్లో ఉన్న ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తారు. ఫలితంగా గిరిజన విద్యార్థులకు పారిశ్రామిక అవగాహన ఏర్పడడంతోపాటు సాంకేతిక విద్యను పూర్తిచేసిన తర్వాత ఎటువంటి ఉపాధి అవకాశాలను ఎంచుకోవాలనే దానిపై సంపూర్ణ అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్ధార్ తెలిపారు. స్థానిక ఏఎస్పీ కె.ధీరజ్‌ను గిరిజన విద్యార్థులతో విజ్ఞాన యాత్రకు పంపించారు. అధిక సంఖ్యలో గిరిజన విద్యార్థులకు నిర్మాణ్ పేరిట చేపట్టే ఇటువంటి విజ్ఞాన యాత్రలను నిర్వహిస్తామని ఎస్పీ అమిత్‌బర్ధార్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



విజ్ఞాన యాత్రకు వెళుతున్న వారితో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్ధార్

చింతపల్లిలో...

చింతపల్లి: విజ్ఞాన యాత్రకు ప్రయాణమైన విద్యార్థుల బస్సును బుధవారం ఎస్ఐ అరుణ్‌కిరణ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించేందుకు పోలీసు శాఖ 'నిర్మాణ' కార్యక్రమం ద్వారా విశాఖపట్నం తీసుకు వెళ్తున్నట్టు చెప్పారు. రెండు రోజుల పాటు విశాఖపట్నంలోని ప్రముఖ ప్రాంతాలను సందర్శించి తిరిగి వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆదివాసీల కోసం నిత్యం పోరాడిన ఏచూరి

సంతాప సభలో సీపీఎం రాష్ట్ర నాయకులు సురేంద్ర, అప్పలనర్స

అరకులోయ, సెప్టెంబరు 18: ఆదివాసీల సమస్యలపై నిత్యం పోరాడిన మహా నేత, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం అని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ ప్రతినిధులు కిల్లో సురేంద్ర, అప్పలనర్స అన్నారు. సీపీఎం మండల కార్యదర్శి కె.రామారావు అధ్యక్షతన బుధవారం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి సురేంద్ర, అప్పలనర్స పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వంతో సీతారాం చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఆదివాసీలకు అటవీ హక్కుల చట్టం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆదివాసీలకు నష్టపరిచేలా అటవీ పర్యావరణ చట్ట సవరణ చేసినప్పటికీ తీవ్రంగా వ్యతిరేకించి ఆదివాసీలకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, ఆమ్‌ఆద్మీ, కాంగ్రెస్ పార్టీల నేతలు సుజాత, గంగాధర్ పాల్గొన్నారు.



సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సీపీఎం నేతలు సురేంద్ర, అప్పలనర్స

పర్యాటక ప్రాంతాల సందర్శనకు ప్రత్యేక కార్యక్రమాలు

చింతపల్లి, సెప్టెంబరు 18: పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులను ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. బుధవారం పర్యాటక ప్రాంత యువకులు, రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరో నెల రోజుల్లో గిరిజన ప్రాంతంలో పర్యాటక సీజన్ ప్రారంభంకానున్నదన్నారు. యర్రవరం జలపాతం, చెరువులవేనం వ్యూపాయింట్, తాజంగి జలాశయానికి వచ్చే పర్యాటకులకు వినోదంతో కూడిన థింసా, నాటికలు ప్రదర్శించాలన్నారు. గిరిజన ఉత్పత్తులను సైతం పర్యాటకులు అందుబాటులోకి అందించాలన్నారు. దీనికి అవసరమైన ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆయన వివరించారు.

విద్యార్థులు బయటకు వెళ్లకూడదు

చింతపల్లి, సెప్టెంబరు 18: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు అనుమతి లేకుండా బయటకు వెళ్లరాదని ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి సూచించారు. స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల-2ను బుధవారం సందర్శించారు. రెండు రోజుల క్రితం పాఠశాలకు చెందిన కించే భీమరాజు అనే విద్యార్థి అదృశ్యం కావడంపై ఏటీడబ్ల్యూవో ఉపాధ్యాయులు, విద్యార్థులను విచారించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులపై ఉపాధ్యాయులు, హెచ్‌డబ్ల్యూవో, హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అనారోగ్యం చేస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. హెచ్‌ఎం పండన్న పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటుచేయాలని ఆందోళన

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 18: మండలంలో గల కించాయపుట్టు పంచాయతీ గుమ్మసిరగంపుట్టు, సరియాపుట్టు, తేనెలమామిడి, కించాయిపుట్టు గ్రామస్థులు సెల్ టవర్ ఏర్పాటు చేయాలని బుధవారం ఆందోళన బాట పట్టారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న తమ గ్రామాలకు సెల్ సేవలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నేత శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ఆన్‌లైన్‌తో ఎక్కువ శాతం ముడిపడి ఉన్నాయని సెల్ సిగ్నల్స్ లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు పథకాలను పొందేందుకు అష్టకష్టాలు పడుతున్నారని అన్నారు. సెల్ టవర్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించడం జరిగిందని తెలిపారు. అధికారులు స్పందించి సెల్ సేవలు అందుబాటులోకి వచ్చే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న గిరిజనులు

21 నుంచి మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వేడుకలు

▸▸ పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్

పాడేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి అక్టోబరు 20వ తేదీ వరకు వాడవాడలా వేడుకలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ ఆంధ్రా, ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ పిలుపునిచ్చారు. ఆయన పేరిట బుధవారం మీడియాకు ఓ లేఖను విడుదల చేశారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక పోలీస్ బలగాలతో అణచివేతలు కొనసాగిస్తున్నారని గణేశ్ ఆరోపించారు. కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ ఏవోబీలో విప్లవకారులపై దాడులకు పాల్పడుతున్నదన్నారు. గతంలో గ్రీన్‌హంట్ పేరిట జరిగిన దమనకాండను నేడు కగార్ పేరిట కొనసాగిస్తున్నదన్నారు. ఏంచేసినా విప్లవాన్ని నాశనం చేయలేరని, రామ్‌గూడ ఘటనలో పార్టీకి భారీ నష్టం కలిగినప్పటికీ క్రమంగా పుంజుకుని ఏవోబీలో కార్యాకలాపాలను కొనసాగిస్తున్నదని గణేశ్ పేర్కొన్నారు.

కొత్తపల్లి జలపాతం నూతన కార్యవర్గం ఎంపిక

పాడేరు రూరల్ (జి.మాడుగుల), సెప్టెంబరు 18: అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కొత్తపల్లి జలపాతంలో టూరిజం వర్కర్లుగా 23 మంది పని చేస్తున్నారు. అందులో 10 మంది సభ్యులతో నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ తెలిపారు. జలపాతంలో విధులు చేపట్టే ఎకో-టూరిజం సిబ్బంది అధ్యక్షుడుగా సురేష్, కార్యదర్శిగా చంటిబాబు, గౌరవాధ్యక్షులుగా వంతాల రాజును ఏకగ్రీమంగా ఎంపిక చేశామన్నారు. జలపాతంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది జీతభత్యాల సమస్యలపై త్వరలోనే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు స్పష్టం చేశారు.

విద్యా శాఖలో కలకలం!

... 5వ పేజీ తరువాయి

డిమాండ్ చేశాడు. దీంతో ఆయన విశాఖపట్నంలోని ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు బుధవారం మధ్యాహ్నం 12.10 గంటల సమయంలో ఈశ్వరదత్తు డీఈవో కార్యాలయానికి వెళ్లి ఓపెన్ స్కూల్స్ కోఆర్డినేటర్ ఒ.కుమార్‌కు రూ.30 వేలు ఇచ్చారు. ఆయన నగదును టేబుల్ సొరుగులో పెడుతుండగా.. అప్పటికే అక్కడే మాటు వేసివున్న ఏసీబీ డీఎస్పీలు నాగేశ్వరరావు, రమ్యలు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం విద్యా శాఖ కార్యాలయంలో సాయంత్రం వరకు సోదాలు నిర్వహించి, పలు రికార్డులను పరిశీలించారు. ఓపెన్ స్కూల్స్ పరీక్షా కేంద్రాల నిర్వహణకు గతంలో ఎన్ని విద్యా సంస్థలకు అనుమతులు ఇచ్చారు? ఆయా యాజమాన్యాల నుంచి తీసుకుంటున్న లంచం సొమ్ములో ఎవరెవరికి ఎంతెంత వాటాలు వెళుతున్నాయి? లేకపోతే లంచం వసూళ్లకు కోఆర్డినేటర్ ఒక్కడే బాధ్యుడా అన్న కోణాల్లో ఏసీబీ అధికారులు డీఈవో ఎంవీ లక్ష్మమ్మ, డిప్యూటీ డీఈఓ అప్పారావు, సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు, వివిధ విభాగాల ఉద్యోగులను విచారించి, సమాచారం సేకరించినట్టు తెలిసింది. లంచం తీసుకుంటూ పట్టుబడిన కుమార్‌ను ఏసీబీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

జోరుగా సీతాఫలాల విక్రయాలు

... 5వ పేజీ తరువాయి

చేసుకుని, అనుభవాలే పాఠాలుగా గిరి రైతులు సీతాఫలాల తోటల పెంపకాన్ని చేపడుతున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే..

ఏజెన్సీలో గిరిజన రైతులు పండిస్తున్న సీతాఫలాల సాగును ప్రోత్సహించడంలో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరుగుతుంది. సీతాఫలాల ముడి సరకుగా వినియోగించి ఐస్‌క్రీమ్‌లు, జామ్‌లు తయారు చేయవచ్చు. ఏజెన్సీలోని సీతాఫలాలు చక్కగా పండుతుండడంతో వాటి సాగు విస్తీర్ణాన్ని పెంచి, వాటి ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేయడం ద్వారా గిరిజన రైతులు, గిరి యువతను ప్రోత్సహించే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సంక్షిప్తంగా..

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

▸▸ జిల్లా విద్యా శాఖాధికారి బ్రహ్మాజీరావు

పాడేరు రూరల్, సెప్టెంబరు 18: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు దరఖాస్తు చేసుకునే గడువు పొడిగించినట్టు జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు 8వ తేదీన జరగనున్న పరీక్షకు ఎనిమిదో తరగతి విద్యార్థులు ఈ నెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజనల్ ఎస్‌బీఐ కలెక్ట్ రసీద్‌ను ఈ నెల 27వ తేదీలోగా డీఈవో కార్యాలయంలో అందించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యంలేని పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదుకుంటూ కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.5 లక్షలలోపు ఉన్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో విద్యార్థి ఆధార్ కార్డులో ఉన్న విధంగానే పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకొనే సమయానికి ఎటువంటి ధ్రువపత్రాలు అవసరం లేదని, పరీక్ష సమయానికి అన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 ఈ నెల 10వ తేదీలోగా ఆన్ అప్లికేషన్‌లో ఇచ్చి ఎస్‌బీఐ కలెక్టు లింక్ ద్వారా చెల్లించాలన్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా విద్యా శాఖాధికారి వారి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఎనిమిదో తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

చింతపల్లి, సెప్టెంబరు 18: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీవో జీవీ రమణ సూచించారు. పోషకాహార మాసోత్సవంలో భాగంగా సమగిరి, వంతమామిడి, బౌగ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి బాలింతలు, గర్భిణులకు తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు అందించే ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం పీవో మాట్లాడుతూ ఆదివాసీలు పోషకాహార లోపాన్ని నియంత్రించుకునేందుకు ఆకుకూరలు, పప్పుధాన్యాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో రామలక్ష్మి సర్పంచ్ మహేశ్వరి పాల్గొన్నారు.

చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 18: చిన్నారుల ఎదుగుదలపై అంగన్‌వాడీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీడీపీవో లక్ష్మీదేవి చెప్పారు. మండల కేంద్రంలో బుధవారం చిన్నారుల ఎత్తు, బరువు కొలవడంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలను కార్యకర్త ఎప్పటికప్పుడు బరువు, ఎత్తు కొలిచి రికార్డు చేయాలన్నారు. చిన్నారుల్లో ఎదుగుదల లోపం గమనిస్తే వైద్యుల వద్దకు తీసుకువెళ్లి పరీక్షలు చేయించాలన్నారు. అవసరమైతే పాడేరు ఎన్ఆర్‌సీ కేంద్రానికి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వలసమ్మ, మోహని, రామలక్ష్మి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కేసులు

అనంతగిరి, సెప్టెంబరు 18: చదువుకునే వయస్సులో వివాహం పేరుతో ఇద్దరు జీవితాలను నాశనం చేస్తున్నారని, బాల్య వివాహాలు చేస్తే తప్పనిసరిగా కేసులు నమోదు చేయిస్తామని సీడీపీవో సంతోషి కుమారి స్పష్టం చేశారు. జీనబాడు పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రంలోని బుధవారం పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా తల్లీబిడ్డ చిత్రాన్ని వేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నియంత్రణకు అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరిలో 'స్వచ్ఛతాహి సేవ'

అనంతగిరి, సెప్టెంబరు 18: మండల కేంద్రంలో బుధవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు. చెత్తాచెదారం లేకుండా పారిశుధ్య కార్మికుల ద్వారా తొలగింపు చర్యలు చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని సచివాలయం కార్యదర్శి బాలకృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది గీత, సంధ్య, వసంత, రాజశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

బురిడివలసలో బోరు నిర్మాణం

డుంబ్రిగుడ, సెప్టెంబరు 18: మండలంలోని బురిడివలస గ్రామంలో బుధవారం తాగునీటి బోరు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొములు మాట్లాడుతూ ఇకపై గిరిజనులకు తాగునీరు అందుబాటులో ఉంటుందన్నారు. కమ్యూనిటీ భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజ్‌కుమార్, మోహన్‌రావు పాల్గొన్నారు.

జీపీఎఫ్ బకాయిలు చెల్లించాలి

హుకుంపేట, సెప్టెంబరు 18: ఉపాధ్యాయుల జీపీఎఫ్ బకాయిలు చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా నాయకుడు సింహాచలం డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు భవిష్యత్తు అవసరాల కోసం దాసుకున్న సొమ్మును అవసరమైనప్పుడు అందించాలన్నారు. జీవో నంబరు-3 అమలు చేయాలని కోరారు. ఈ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన విన్నవించారు.

జోలాపుట్టులో అన్నసమారాధన

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 18: మండలంలోని జోలాపుట్టులో వినాయక చవితి సందర్భంగా బుధవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రసాదం స్వీకరించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు జగదీష్, కిరణ్, గౌరి, శంకర్, గంటి గౌరి మాట్లాడుతూ చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమను 21 రోజుల అనంతరం నిమజ్జనం చేస్తామన్నారు. 15 రోజులు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు.

పరిసరాలు పరిశుభ్రత పాటించాలి

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 18: పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సర్పంచ్ దనియా అన్నారు. రంగబయలు పంచాయతీలో బుధవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలనే నినాదాలతో ర్యాలీ సాగించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే పలు రకాల వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ధనుర్జాయ్ పాల్గొన్నారు.